# ఇంటా బయటా

మేష్టరు హరి చెంచయ్యగారు దేనికి ప్రసిద్ధి అని ప్రశ్నిస్తే ఏ అయిదో తరగతి కుర్రాడైనా టకీ మని జవాబిస్తాడు 'భోజన పరాక్రమానికని!'

మానవునికి జిహ్వా చాపల్యం కాస్త ఎక్కువేమో, ఊరిలోని కుర్రకారులోనూ, దానితోబాటు కుర్రతనం చావని 'పెద్ద కారు' లోనూ హరి చెంచయ్య గారి భోజన ప్రియత్వం అపహేళనకు పాత్రమౌతుండేది.

వినడమే గాని తత్కళిళ చాతురిని నేనెన్నడూ కళ్ళార చూచిన పాపాన పోలేదు.

భోజన ప్రియుల్లోనూ శాఖా భేదాలు లేకపోలేదు. కక్కుర్తితో ఏది దొరికితే అది స్వాహా చేసి కడుపును బూరటిల్ల చేసుకునే కుక్షింబరులు, విడుపూ విరామమూ లేకుండా అహరహమూ నోటికీ చేతికీ పోటీ బెట్టే తిండిపోతు రాయుళ్లు, రుచిని గుర్తెరిగిన రసనేంద్రియంతో, శుచిగా వున్న వంటకాల జోలికి మాత్రం వెళ్లి, ఎప్పటికప్పుడే పచనంలోని బాగోగుల్ని విడమరిచి చెప్పగలిగిన 'రసజ్ఞులూ' ఈ మూడు శాఖల్లో హరి చెంచయ్యగారిదే శాఖో నాకు చాలా రోజులవరకూ తెలిసింది గాదు.

ఇంతలో కరణం గారి పుణ్యమా అని ఊరికంతా పండువగా ఓ పెళ్ళి జరిగింది. గ్రామమంతటా వసూలైన చందా డబ్బులతో కరణం గారు కుమార్తె పెళ్లి ఘనంగా జరిపించారు. వివాహ సందర్భంలో జరిగిన విందులో నేనూ, హరి చెంచయ్యగారూ ప్రక్క ప్రక్కన  కూర్చోవడం తటస్థించింది.

అనుకున్న సమయానికి మాంగల్యధారణ పూర్తయింది. ఆ తరువాత మధ్యాహ్నం పన్నెండు వరకూ చదివింపులు కొనసాగాయి. కాళ్ళు తిమ్మిర్లు పట్టుకపోయి బంధులోకమంతా పందిరి క్రింద ఆవులిస్తుండగా కరణంగారు గంభీర స్వరంతో 'ఎవ్వరూ బయటికి వెళ్ళగూడదు, ఆవలివైపు పందిరిలో విస్తర్లు వేసేశాము' అన్నారు. ఈ వార్త వినగానే ఎక్కడివా రక్కడ దూసుకుని ఈ పందిరి క్రింద మాయమైన వారు ఆ పందిరి క్రింద తేలారు. నాలు గడుగులు వెనుకబడి చోటు కనిపించక చిక్కరించిన వాణ్ణి బహుశా నేనొక్కడినే నేమో! సమయానికి హరి చెంచయ్యగారు ఆపద్బాంధవునిలా ఆదుకున్నారు.

"రావయ్యా రంగనాథం! ఇక్కడ....రా" అన్నారాయన.

అప్పటికే ఆయన కాళ్ళూ చేతులూ శుభ్రంగా కడుక్కుని వచ్చి విస్తరాకు పైన నీళ్ళు చల్లుకుని పద్మాసనం వేసుకుని తరువాత కార్యక్రమాలకు సన్నద్ధంగా వున్నారు.

ప్రక్కన నేను కూచోగానే "విస్తరి బాగా తుడిచేయండి" అన్నారు.

నేను నీటిని చిలకరించుకుంటూ వుండగా ఆయన చెప్పుక పోసాగారు.

"భద్రం భద్రమయ్యా రంగనాథం! ఈనుగపుల్లలు పూడిపోయేటట్టుంటే మొదటే జాగ్రత్తపడి తీసేయడం మంచింది. ఈతడ ఆకులతో వచ్చిన చిక్కేయిది. ఆ రోజుల్లో పెళ్ళిళ్ళ కిలా కాదయ్యా రంగనాథం! రేపు పెళ్ళనగా ఈ రోజు తెల్లవారుజామున చద్దన్నం కట్టుకుని బయల్దేరి సాయంత్రానికల్లా కట్టలు కట్టలుగా తామరాకులు తెచ్చేసేవారు. తింటే తామరాకులో తినాలయ్యా పెళ్ళి భోజనం! ఎందుకూ, కరణంగారు తమ హోదాకు తగ్గట్టు అరిటాకులైనా వేసి వుంటే బాగుండేది! ఈతడ ఆకులు వేశారా, బంతి లేచేసరికి చూడండి. ఇదొక అడుసు మడిగా తయారౌతుంది!"

"నిజమేనండీ నిజమే!" అంటూ ఓ చిరునవ్వుతో ఆయన మాటల్ని బలపరిచాను.

ఇంతలో ఫలహారాలు వచ్చేశాయి. ఒక జిలేబీ, రెండు పోళీలు, నాలుగు వడలు, ఒక్కింత మిక్స్చరు....

నాకంటే ముందుగా జిలేబీని మటుమాయం చేసి హరి చెంచయ్య గారు పోళీలను స్పృశిస్తూ "మంచి పోళీ లక్షణాలేవో చెప్పమంటావా రంగనాథం!" అన్నారు.

"చెప్పండి" అన్నాను.

"ఏవైపు కొలిచినా జానకు తక్కువుండ గూడదు. తాకితే మల్లెపూవులా వుండాలి. నోట్లో వేసుకుంటే వెన్నలా కరిగిపోవాలి!...."

పోళీ వెన్నలా కరిగిపోవడం నాకూ యిష్టమే! కానీ చాలీ చాలని జీతపు రాళ్ళతో సంసార సాగరానికి వారధి గట్టి సుఖాల దీవికి చేరుకోవడంలో ఏ దరీ కానలేని సామాన్య మానవులకు యిలాటి గొంతెమ్మ కోరిక లుండటంలో సబబుందని మాత్రం నేను భావించలేకపోయాను!

హరి చెంచయ్య గారు ఆకును ఖాళీచేసి తల పైకెత్తారు. ఎడమ చేతిలోని పెద్ద గంగాళం నుండి అన్నంతీసి వరుసగా వడ్డించుకుంటూ వలలుని వంటి మనిషి ఒకతను మా వైపుకు వస్తున్నాడు!

"ఆఁ, అలా వుండాలి!" అన్నారు హఠాత్తుగా హరి చెంచయ్యగారు.

అలా వుండవలసిందేమిటి? వడ్డించే మనిషా? కాక వడ్డించే తీరా? లేక వడ్డించే అన్నమా?

"విస్తరిలో వేస్తే తుమ్మిపువ్వులు రాసిపోసి నట్టుండాలి! ఈ బియ్యం పేరేమిటో తెలుసా రంగనాథం! మన ప్రాంతంలో వీటిని టేబుల్ సంబాపు లంటారు. నువ్వ చూచావో లేదో గానీ ఈ బియ్యంతో ముక్కులు కుట్టుకోవచ్చు!........."

నిజమే! పెళ్లి విందు కోసం కరణం గారు రెండు మూడేళ్లనాటి పాత వడ్లను పైకి తీసి మిషనులో దంపించినట్టున్నారు. సుతిమెత్తని ప్రాణాల కోసం ఉద్దేశింపబడిన బియ్యమేమో, దవడలు కదిలీ కదలక ముందే అన్నం అన్నవాహికలోకి జారిపోతోంది.

"ఐనా పలమనేరు పప్పు రుచే రుచి!" కందిపప్పును గురించి చెప్పుకపోతున్నారు హరి చెంచయ్యగారు. "నేను ఎన్నో రకాల పప్పులని చూచాను. ఇలాంటి ముద్ద పప్పు మాత్రం మరెక్కడా కనిపించదు. నీళ్ళల్లో వేసి చూడు, గ్యారంటీ అయిదు నిమిషాల్లో ఉడికి పోతుంది! ఇప్పుడు మనకు బజార్లో దొరికేది గూడా కందిపప్పేనా రంగనాథం?"

"ఆ నాసిరకం పప్పు గూడా శేరు ఒకటిన్నర రూపాయలు గదండీ మేష్టారూ!" అన్నాను.

నా మాటలు హరి చెంచయ్య గారి చెవిలో పడ్డాయో లేదో గాని, అప్పుడు మజ్జిగ కూరలోని పండు గుమ్మడి ముక్క ఒకటి ఆయన నోట్లో పడుతోంది.

ఈసారి హరి చెంచయ్య గారు నా వైపుకు వంగి అదొక రహస్యంలా మెల్లగా చెప్పారు.

"మజ్జిగ పులుసు దివ్యంగా వుంది రంగనాథం! వంట మనిషి ఎవడో గాని పాక విద్యలో కాకలు తీరిన వాడిలా వున్నాడు."

హరి చెంచయ్య గారు వివరించి చెబితే గానీ విషయాన్ని గ్రహించలేని అమాయకుణ్ణిగా నన్ను భావించారేమో! తాళ ఫల ప్రమాణంలో గాకపోయినా, అంతకంటే కాస్త చిన్న సైజుతో సర్కసు బఫూను చేతిలో టోపీల్లా హరి చెంచయ్య గారి చేతిలోనుంచీ నిర్విరామంగా పై కెగురుతున్న ముద్దలు వంట పాక కళా నైపుణ్యాన్ని చెప్పకనే చెబుతున్నాయి!

బంతిలో పులుసన్నాన్ని గూడా అందరికంటే ముందుగా హరి చెంచయ్యగారే ముగించినట్లు జ్ఞాపకం.

ఉన్నట్టుండి 'రసం, రసం' అంటూ ఆయన పెట్టిన కేకలకు పందిరి పందిరంతా వులికిపడింది. బకెట్ చేత బట్టుకుని పరధ్యానంగా నిల్చున్న బక్కపలచటి వడ్డన మనిషి తృళ్ళిపడి పరుగెత్తు కొచ్చేశాడు.

అతగాడు బకెట్‌లో ముంచి గరిటెను పైకెత్తాడు.

హరి చెంచయ్య గారు దోసిలి పట్టారు.

అతడు పోస్తున్నాడు.

ఈయన త్రాగుతున్నాడు.

సురులు అమృతాన్ని అలా సేవించి వుంటారు. అసురులు మద్యాన్ని అలా ఆస్వాదించి వుంటారు. మండుటెండలో నాలుక పిడచగట్టుకపోయిన సేద్యగాడు కూటి నీళ్లను అంత ఆప్యాయంగా త్రాగి వుంటాడు!

"పన్నీరు లాంటి రసం! బాగానే వుందనుకో. కానీ యింగువ కాస్త ఎక్కువైంది..."

"మంచిదే కదండీ! ఇంగువ వల్ల జీర్ణశక్తి వృద్ధవుతుంది గదా!" అన్నాను.

"పిట్ట మేతతో ప్రాణాలు నిలుపుకునే నాజూకుతనాన్ని ఒంటబట్టించుకున్న వాళ్ళకు జీర్ణశక్తి వృద్ధి కావాలి! మనకేమయ్యా రంగనాథం! రాయి తిన్నా నీరై పోతుంది?"

అంతలో ఆకు దొన్నెలు వచ్చేశాయి. దొన్నెల నిండుకూ పాయసమూ నింపేశారు. హరి చెంచయ్యగారు ఒకటి రెండుసార్లు పాయసాన్ని చవిచూచిన తర్వాత నుదురు చిట్లించి, కళ్ళు కుంచించి "ఈ పాయసంలో లోపమేమిటో చెప్పగలవా రంగనాథం!" అన్నారు.

"అబ్బే, చెప్పలేనండీ!" అన్నాను.

"కుంకుమపువ్వు బొత్తిగా లేదు!"

"................................."

"నువ్వేమైనా అను రంగనాథం! ఏయే వంటకంలో పడాల్సిన వస్తువు ఆయా వంటకంలో పడిపోవాలయ్యా! లేకపోతే రుచి పోతుంది."

మజ్జిగ యింకా పందిరిలోకి రానట్టుంది. ఆ వ్యవధిని పురస్కరించుకొని హరి చెంచయ్యగారు కుంకుమ పువ్వుని గురించి చెప్పసాగారు.

"కుంకుమపువ్వు ఖరీదెంతవుతుందో తెలుసా రంగనాథం? తెలిసి వుండదు. నేను చెబుతున్నది అప్పటం కుంకుమపువ్వు మాట! అది తులం నూట యాభై రూపాయలు. బంగారానికి రెండింతలు. నేను కల్లూరిలో వుండేవాణ్ణి. కల్లూరి దొరవారి పిల్లలకు ట్యూషను మనదేలే! ఓరోజు సాయంత్రం ట్యూషనుకు వెళ్ళానా? దొరవారి భార్య సుభద్రయ్యమ్మా రావుగారు 'మేష్టరు గారూ! కాశ్మీర్ నుంచీ కుంకుమపువ్వు తెప్పించాము. కాస్త రుచి చూస్తారా?' అన్నారు. సూదితో అద్ది నాలుకపైన వేసుకున్నానయ్యా రంగనాథం! అంతే. వారం రోజులు నాలుక తిమ్మిరి వదిలింది గాదు!"

భోజనానంతరం గూడా హరి చెంచయ్యగారు నన్ను వదిలిపెట్టారు గాదు. గమగమలాడే వక్కపొడిని పిడికెడు నిండుగా తీసుకుని, అరకట్ట తమలపాకులను చేరువలో వుంచుకుని వరుసగా సున్నం రాసి లేత మామిడి కాయల్ని చప్పరించే మేకపోతులా కరకర నమిలి మ్రింగుతూ ఆయన వరండాలో నున్నటి గారపైకి వ్రాలిపోయారు.

వీధిలోకివెళ్తున్న గ్రామస్తుల్లో ఓ పెద్దమనిషి "ఏమండీ హరిచెంచయ్య గారూ! భుక్తాయాసం కాబోలు!" అంటూ ముసిముసి నవ్వులు ఒలకబోశాడు.

"ఆ ఏం భుక్తాయాసం లేవోయ్ రంగనాథం! ఒకసారి....నా కప్పటికి పది పన్నెండేళ్ళ కంటే ఎక్కువ లేవు. నేనూ, మా పెద్ద మామయ్యా తిరుచానూరు గరుడ పంచమికి వెళ్ళాము. పెద్ద సత్రంలో భూరి సంతర్పణ జరుగుతోంది. మా పెద్దమామయ్యంటే, అంతటి భారీ మనిషి యిప్పుడెక్కడున్నాడు? విందు నుంచీ బయటికి వచ్చాము. 'ఒరేయ్ చెంచయ్యా? నాకేమిటో ఉబ్బరంగా వుంది. నువ్వు కాసేపు మెట్లపైన కూచో' అంటూ ఆయన కోనేట్లోకి దిగేశారు. కోనేటి నిండుగా నీళ్లు తొణికిసలాడుతున్నాయి. ఒక మెట్టు, రెండు మెట్లు, మూడు మెట్లు.....అలాగే నీళ్ళు భుజాల దాకా వచ్చాయి. సుమారు ఓ అరగంటసేపులో భుక్తాయాసం పటాపంచలైపోయింది.

* * *

కరణంగారింట్లో పెళ్ళి జరిగిన నాటి సాయంకాలం ఆరు గంటల వరకూ చావడీలో పేపరు చదువుతూ వుండి, ఆ తరువాత యింటికి వెళ్లాను. వీధి మెట్లెక్కుతుండగా యింటి లోపలి నుంచీ వస్తున్న చెంచయ్య గారి భార్య ఎదురైంది, పొడుగాటి మనిషి. ఎడములేని చీరేమో, ఆమె కెక్కడికీ చాలడం లేదు. ఆ చాలీ చాలని చీరచెంగులో కట్టుకున్న మూట నాకెక్కడ కనపడిపోతుందోనని ఆమె తల వంచుకుని చరచరా నడిచిపోతోంది.

వెళ్లిపోతున్న హరి చెంచయ్య గారి భార్యనుచూస్తూ నేనలాగే మెట్లపైన నిల్చుండిపోయాను. ఏవో ఆశలను మనసులో వుంచుకుని బలీయమైన వ్యతిరేక శక్తులతో పోరాడి పోరాడి బ్రతుకును లాక్కుపోతున్న మొండితన మేదో ఆమెలో గోచరిస్తోంది. కాదు కాదంటే ఆమెకు ముప్పై అయిదేళ్ళుంటాయేమో, హఠాత్తుగా చూస్తే యాభై యేళ్ళ ముసలిదానిలా కనిపిస్తుంది. కనిపించకేం చేస్తుంది పాపం! చంటిబిడ్డ, ఎడబిడ్డ, అంతకంటే పెద్ద బిడ్డ....యిలా రకాల వారిగా ఆమెకు బిడ్డలున్నారు. హరి చెంచయ్యగారి సంతాన సౌభాగ్యమేపాటిదో నాకు సరిగ్గా తెలియదు. కానీ ఆయన పరాయివాళ్ళ పిల్లలకోసం ఎదురు చూడకుండా స్వయంగా స్వగృహంలోనే ఒక చిన్న పలుకూటాన్ని స్థాపించుకోడానికి తగినంత పిల్లలున్నారని మాత్రం స్పష్టంగా తెలుసు!

ఎక్కడో చదివిన పాట జ్ఞప్తికి వచ్చింది.

"ఆయమ్మ చీరకు ముళ్ళు పదహారు
ఆ తల్లి సంతాన మది దోసపాదు..."

"ఏమిట్రా నాయనా! అలా దిగాలు పడి చూస్తున్నావు?" అమ్మ పలకరింపుతో స్పృహ వచ్చింది. "మేస్టరు గారి భార్య వెళ్తుంటే....." అని అర్థోక్తిలో నిలిపేశాను.

"బియ్యం కోసం వచ్చింది. రాకేం చేస్తుంది. చెప్పు. మధ్యాహ్నానికే బియ్యం లేవని అతగాడికి తెలుసునట! రాత్రి భోజనాన్నికైనా ఓ శేరు బియ్యం తెచ్చి యింట్లో పడవేయకపోతే ఆ మనిషి నేమనాలి? పిల్లలు మాటి మాటికీ వచ్చి పొయ్యివైపు చూస్తారట! తల్లిని అడగలేక బుద్ధి తెలిసిన పిల్లలు లోటా నిండుకూ మంచినీళ్ళు త్రాగి సరిపెట్టుకుంటున్నారట. అబ్బబ్బ. గుండె తరుక్కుపోతుందిరాబాబూ! మనిషన్న తర్వాత కాస్త వివేక ముండాలి. ఊళ్ళో మూడు వందల గడపలున్నాయి గదా అని ఒకింట్లో గాకపోతే మరొక యింట్లో పెళ్ళో, పేరంటమో జరిగితే తన పొట్టమాత్రం పూడితే చాలు ననుకుంటే యిక పెళ్ళాం బిడ్డల గతేం కావాలి?"

అమ్మకు హరి చెంచయ్య గారి పట్ల దురభిప్రాయమూ, ఆయన భార్యపైన సానుభూతీ కలగడంలో ఆశ్చర్యపడవలసిందేమీ లేదు. కాని ఒకానొక వ్యక్తిని గురించి ఒక నిర్ణయానికి రావడానికి ముందుగా వివిధ దృక్కోణాలనుంచీ ఆలోచించడం మంచిది. నిజానికి హరి చెంచయ్య గారు మాత్రం చేయగలిగిందేముంది. ఆయన బీడీ కాల్చడు. సిగరెట్టు ముట్టుకోడు. ఎవరైనా యిస్తే తప్ప తాంబూలం సైతం నమలడు. నిస్సందేహంగా జిల్లా బోర్డు గాళ్ళిస్తున్న నెలజీతం పూరాగా కుటుంబానికే వినియోగమౌతోంది. ఆ డబ్బు కుటుంబానికి చాలడం లేదంటే అందుకు హరి చెంచయ్యగారిని ఈసడించడమేం సబబు? కొట్టులో యాభై రూపాయలకు పైన ఒక్క కానీకి గూడా అరువు పుట్టదు. బాకీలు మాత్రం ఎవరిస్తారు? ఇదివరకెవరో లోకజ్ఞుడు చెప్పినట్టు తనకు తానే స్థిరాస్తిగానూ, పెళ్ళాం బిడ్డలే చరాస్తిగానూ వున్న మానవునికి అప్పు పెట్టగల ఔదార్యం ఈ లోకంలో గగన కుసుమం గదా!

పెరట్లో కాళ్ళూ చేతులు కడుక్కుని, కాసేపు పచారు చేయవచ్చు గదా అని డాబా పైకి వెళ్లాను.

రచ్చపైన్నుంచీ లౌడ్ స్పీకరులా వినిపిస్తోంది – హరి చెంచయ్య గారి గొంతుక, "మీరు నూరు చెప్పండి. వెయ్యి చెప్పండి. నాలుకకు పదునెక్కించడంలో ఆవకాయకు సాటి మరొకటి లేదు. కమ్మని గేదె పెరుగు, ఆవకాయ ముక్కల ఎదుట అరవై నాలుగు పిండివంటలూ, ముప్పై రెండు కూర.....?"

● ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 1959 ●